

"...ఇది మూడునెల్లముందే జరిగిందిరా! టాక్ మహాల్లో మేం ఇద్దరం పరస్పరం హృదయాలు చూపులద్వారా మార్చుకున్నాం. ప్రతిరోజూ నేనెక్కే బస్సులోనే వస్తుం దామె. సాయంత్రంపూట సామాన్యంగా ఒకేబస్సులోనే వస్తాం. నన్నామెకు బాగా తెలుసు ప్రతిరోజూ చూస్తుంటాను. మాటల్లో ఓసారి ఆమె ఎస్. ఎస్. ఎల్. సి. పాసయిందనీ ఎక్కడో చదువుతూందనీ విన్నాను. మొన్న ఒక రోజు ముందు సీట్లోనే వచ్చి కూర్చుందిరా!" అన్నాడు మల్లిబాబు. రావు, ప్రాణమిత్రుడూ సలహాదారూ, మెడికో, తలూపాడు.

"కూర్చునేముందు ఆచిక్కటి జడను ఒక్కసారి వెనక్కు తోసింది. ఒక్కక్షణం ఆజడ నాచెంపల్ని తాకి, లాలించి క్షణంలో తిరిగి ఆమెను చేరుకుంది. ఒరేయ్.... ఆమె ఎవరయినాసరే ఆమే నీకాబోయే వదిన...తర్వాత నీ ఇష్టం.."

రావు సీరియస్‌గా ఆలోచించసాగాడు. ఇద్దరూ చిన్నప్పట్నుంచి క్లాస్‌మేట్సు....ప్రస్తుతం రూం మేట్సుకూడా. మల్లిబాబు కాలేజీలో లెక్చరర్ కావటంవల్ల అందరిలోనూ ప్రీగా తిరగలేక పోవటం వల్ల అతని పరిస్థితి—ఈ విషయంలో—కొంచెం చిక్కుగా...ం. విద్యార్థిగావుంటే అదోమాదిరి.

—45వ పేజీ చూడండి

# పిల్లల మనస్సులు

16-వ పేజీ తరువాయి

వాలి. అంతగాని వారిని అనవసరంగా బాధ పెట్టకూడదు.

ప్రతి చిన్నవిషయాన్ని ప్రమాదమైన విషయంగా తీసుకుని బాధపడే పిల్లలది సున్నితమైన మనస్సు. వీరు దేన్నీ ఓర్చుకోనేరరు. తల్లి వారి కనుగుణంగా మెల్లగా చెప్పాలి. మనస్సుని గాయపర్చకుండా చేసిన తప్పుని చూపెట్టాలి. అంతే కానీ అవసరపడి వార్ని నొప్పించకూడదు.

పిల్లలు ఎక్కువ ఆంక్షలుపెట్టితే మా పక్కింటి అబ్బాయిలా తయారవుతారు. ఆ అబ్బాయి తండ్రి తన చిన్నతనంలో తన తండ్రి మాటని తను కాదనలేదుట. అందుకని తన కొడుకు తనమాట జవదాటకూడదు అని ప్రతి చిన్నవిషయానికి కోప్పడేవాడు. క్రొత్తలో విన్నా, పెద్దవాడవనూ అవనూ నిర్లక్ష్యం పెరిగి ఎదురుచెప్పి తన ఇష్టమొచ్చినట్లు చేయసాగాడు. ఆతండ్రికి మాత్రం కొడుకుమీద ప్రేమ లేదా ? ఉంది కాని పిల్లవాడ్ని అర్థం చేసుకోనేరక పాడుచేసుకున్నాడు.

మా లీల చిన్నప్పటినుంచీ కొంచెం పిలగా ఉంటుంది. అందుకని వాళ్ల అమ్మ అన్నీ తనే చేసిపెట్టేది. కొంచెంకూడా స్వతంత్రం ఇవ్వక పోవడంతో ఆ పిల్ల అన్నింటికీ తల్లిమీదే ఆధారపడింది. ఆఖరికి అత్తవారింటికి వెళ్లితే అందరు ఆడపడుచులు "మా వదినకి వాళ్ల అమ్మే చేయాలి. ఆఖరికి చీరకట్టడం కూడా" అని నవ్వుతారుట. ఆపిల్ల ఏమీ స్వంతంగా ఇప్పటికీ చెయ్యనేరదని అందరూ హేళనచేస్తున్నారు.

అతిప్రేమ, అతి కఠినత్వం పిల్లలకి పనికిరాదు. తల్లితండ్రులు తమ పిల్లల్నందర్నీ సమానంగా చూడాలి. పిల్లల మనస్తత్వాలకి అనుగుణంగా నడుచుకోవాలి. మరీ విచ్చలవిడిగాకాక స్వతంత్రంగా బ్రతకనిచ్చి వారిని వారిగానే పెరగనివ్వాలి. అంతేనే గాని తల్లిదండ్రుల అభిప్రాయాల్ని పిల్లల నెత్తిమీద ఇష్టంలేకపోయినా రుద్దకూడదు. నలుగురు పిల్లలతో కలిసి తిరగనియ్యాలి. ఆడుకోనియ్యాలి.

మగవాళ్లు ప్రొద్దున ఆఫీసు కెళ్తే సాయంత్రము వస్తారు. తల్లే ఎక్కువకాలం పిల్లలతో గడుపుతుంది. కనుక పిల్లల భావిజీవితం బాగుండాలంటే తల్లి తగినంత శ్రద్ధ వహించాలి. అన్నింటికంటే తల్లిప్రేమ ముఖ్యమైనది. తల్లి తనకు రక్ష. తన్ని ప్రేమిస్తుందని ఆ పిల్లలకి తెలిసినపుడే పిల్లలు ఆనందంగా పెరుగుతారు. తల్లి తమని నిర్లక్ష్యంచేస్తోందని అనిపిస్తే లేతహృదయాలు నొచ్చుకుంటాయి. ఆ హృదయాల్లో నాటుకుపోయిన అభిప్రాయాల్ని చెరపటం కష్టం. అతి గారాబంతోటి పిల్లల్ని పాడుచేయకుండా ప్రేమతో సాకుతూవచ్చినపుడే పిల్లలు ఆరోగ్యంగా ఆనందంగా పెరుగుతారు. నేటి బాలలే భావిపౌరులు. అలాంటప్పుడు వారివిషయంలో తగుజాగ్రత్త వహించాలి. వారి లేత మనస్సులని గాయపర్చకుండా పెంచడం తల్లి కర్తవ్యం. ★

---

# లిల్లీ - మల్లీ

17-వ పేజీ తరువాయి

కానీ తను అధ్యాపకుడు—దర్జా, ఠీవి చూపాలి. లోపల ఎంత బాధపడుతున్నా పైకి పొక్కనీక దాచుకోవాలి. "నీకు ఆ అమ్మాయి నచ్చిందీ సరే! ఆ అమ్మాయి నీముఖం చూచి ఏమంటుంది?"

"అదేమిట్రా! మొన్న ఎగ్జిబిషన్‌లో రెండు వారాలు కన్పించింది. గర్ల్స్ పాలిటెక్నిక్ మెట్ల దగ్గర ప్రతిరోజూ కూర్చునేది... నేను చూచీచూడనట్లు నిల్చుంటే బయలుదేరేది తన చెలికత్తెతో—అదే—అజంతా సుందరి. వెనకాలే ఎంతదూరం వెళ్ళానని! ఒకరోజు అజంతాసుందరి నన్ను చూపిస్తూ ఏదో అనింది—ఆ అమ్మాయి—లిల్లీ అని పేరుపెట్టుకున్నాను.. నవ్వి, సిగ్గుపడి అటుతిరిగిపోయింది! ఇదంతా నాటకమట్రా!" మల్లిబాబు హృదయం పగిలిపోతూవుంది.

రావు అన్నాడు,"సరే, రేపు ఆమె బస్సుదిగేటప్పుడు అదేరోడ్డులోరా ! మోటారుసైకిలు వేగంగా తీసుకొచ్చి మీదికి రానిచ్చబోతాను—రక్షించు."

మరునటి రోజు బస్సులోంచి దిగింది మామూలుగా.. నల్లటి చెలికత్తె వెళ్ళిపోయింది ముందుగానే. ఉన్నట్లుండి. ఓ మోటారుసైకిలు దబదబలాడుతూ పైకి రాసాగింది. మల్లిబాబుగుండె గుబగుబలాడింది. లిల్లిమాత్రం ఏం తొణకలేదు. చేతులో పుస్తకాలు సర్దుకుంటూ రోడ్డుకు ఒక ప్రక్కవే నిలబడిపోయింది. మోటారుసైకిలు శరవేగంతో ఆమెప్రక్కగా వెళ్ళిపోయింది. తలెత్తి చూచేసరికి మల్లిబాబు 'హై.ము.కా.' వారిపెంటకుప్పమీద తల్పశాయికి ఒక్కమెట్టు తక్కువగా పడివున్నాడు. లేవబోయి, మళ్ళీ పడ్డాడు.

ఇంతలో గజేంద్రమోక్షంలో విష్ణువులాగా, చెడిపోయిన లారీకి మెకానిక్‌లాగా, పాఠంచెప్పలేని లెక్చరర్‌కు బెల్లులాగా వచ్చేసింది లిల్లి. ఆమెముఖంలో శరహాసచంద్రికల్ని, కరుణాకిరణాల్ని కళ్లతో పట్టుకుని, లేచి, నిల్చున్నాడు. జుత్తు రేగిపోయింది. సైడ్ పక్కకు తిరిగిపోయింది. మల్లె పూలలాంటి షర్టు మట్టిపాలైపోయి, కలువలాంటి పంట్లాం మాసిపోయింది. కొత్తగా పాలిష్‌వేసిన బూట్లు పేడ పారాణిపూసుకున్నాయి.

"సారీ! మీరు జాగ్రత్తగా నడవాలిక్కడ" అంది లిల్లి ట్యూన్‌చేసిన ఫోర్కు సోనోమీటర్‌మీద ఉంచితే వైరుమీది రైడర్ ఎలా నృత్యం చేస్తుందో తెలుసు మల్లిబాబుకు. మనస్సు ట్యూన్‌కాగా హృదయంకూడా అలాగే చేసింది.

"మీ పుస్తకాలు...." తీసి ఇచ్చింది లిల్లి మల్లిగ్రంథరాజాన్ని.

"డాంకెన్‌జీ" అన్నాడు జర్మన్‌లో పడిపోయి.

"అంటే....పుస్తకం పేరా?"

"నైన్...ఎస్ ఇస్ట్....థాంక్స్ అని..." పుస్తకం చూసిందామె....

"ఎర్రని బార్డర్‌తో తెల్లగా వుంది అటామిక్ స్పెక్ట్రా."

"మీరు స్టూడెంట్సా?"

"కాదు.......ఫిజిక్స్ లెక్చెరర్ని......" పుస్తకం వేపు చూచాడు. మరోక్షణంలో వెన్నెల కరిగిపోయింది. మందగమనజితరాజమరాళిలాగు మల్లిబాబు హృదయస్పందనంతోబాటు,లిల్లి మలుపుతిరిగి వెళ్ళిపోయింది. వేయివాట్ల బల్బు ఒక్కసారిగా ఆరిపోయినట్లనిపించింది. మల్లి రూంకి పోయి కూర్చున్నాడు. 'అటామిక్ స్పెక్ట్రా' పుస్తకాన్ని గుండెలమీద వుంచుకుని క్షణంసేపట్లో లిల్లిచేతుల్లోనుంచి అందులోకి ప్రవహించిన మధురకిరణాలవల్ల ప్రజ్వలిస్తూన్న కాంతిని కృత్రిమ రేడియో ధార్మికతో పోల్చుకుంటూ కండ్లు మూసుకున్నాడు....

గైగర్ ముల్లర్ కౌంటర్‌లో బల్బులు వెలిగినట్లు, ఆక్సిజన్‌లో సల్ఫర్ మండగా నీలంరంగు వచ్చినట్లు మెర్క్యురీ రెసొనెన్స్‌లైన్ (2537 ఆంగ్‌స్ట్రామ్) లాగా, హిమాలయాలమంచు ఆకాశంలో రంగరించిన వర్ణంలాగా అతని కలలు వెన్నెల్లో వెలిగిపోయాయి......హైడ్రోజన్‌కన్నా తేలికయింది మనస్సు....

సుడిగాలిలాగా దూసుకువచ్చాడు రావు...... హిమాలయాల కొసనుండి పసిఫిక్‌మహాసముద్రంలోకి పడ్డాడు కలల్లోంచి మల్లిబాబు ఆ తాకిడికి.

"ఇడియట్! మోటారుసైకిలు ప్లాను పాడుచేశావ్!" అన్నాడు మల్లిబాబు తలలో ఇంకా కొంచెం వెన్నెల మిగిలివుండి, జవాబు రాలేదు. నోట్లో అమృతం రుచి ఇంకా వుంది.

"పోయి పోయి పెంటకుప్పలో పడ్డావు—పడేదేదో ఆమె కాళ్ళదగ్గర పడివుంటే పోయేది..."

"ఏం చేసేదిరా, మిలిటరీలాగా వస్తుంటే...."

"మరి మీ బామ్మలాగా, రెండెడ్లబండిలాగా వస్తుందేమిటి.....ఇది మోటార్ సైకిలోయ్.... అయినా అంతగా చెప్పానే....అలా కాళ్ళు తేలేస్తే ఎలాగు...లిల్లినిన్ను చూచి,నవ్వుకోని పోయివుంటుంది.....మళ్ళీ మొదలు" మల్లి కళ్ళు మూసుకుని పెంటకుప్పఘట్టాన్ని ఒక్కసారి స్విచ్‌వేశాడు. వెన్నెల్లో ప్రకృతిదేవతలాగా జింక్ సల్ఫైడ్ ప్లేట్ మీద సింటిలేషన్స్‌లాగా వెలిగింది లిల్లి దరహాసం.

ధుమధుమలాడుతూన్న రావుకు ప్రశాంతంగ పెంటకుప్ప ఘట్టాన్ని—మాటకు మాట—వినిపించాడు. మల్లిబాబు—వెంటనే రావుముఖంలో కళ్ళు పెద్దవయిపోయాయి. వాడి ముఖంమీద నీళ్ళు చల్లడానికి లోనికి పరిగెత్తాడు మల్లిబాబు.

రావు పొద్దున్నే మొదలెట్టాడు పరిశోధన.

"ఆమె నడుస్తూంటే హంసలు నడుస్తున్నట్లుంటుంది"

"ఓ. కె."

"ఆమె జడ నల్లత్రాచు.....చివర నాల్గు పాయలు.....మధురంగా కాటేశాయి అవి......"

"ఇంకా చెప్పు"

"కండ్లు ఏమని వర్ణించను?...."

"పెదవులు ఎలా వున్నాయి?"

## నెర్విటాల్

నరములు బలహీనతకును, రక్తపోటుకున్నూ రామ బాణము. అనుభవ యుక్తముగా చేయబడినది.

8 ఔ. సీసా 5-75, పోస్టేజి 1-75.

ఇండియన్ మెడిసన్ హౌస్, విజయవాడ-2.

## శ్రీబాలాంజనేయ ప్రశ్న

సంతానము, రోగములు, గ్రహబాధలు, వివాహం, పారిపోయిన పశువులు, మనుష్యులయొక్క ఆచూకీ, దొంగిలించిన సొమ్ము, విడిపోయినభార్య మీరు కోరిన 5 ప్రశ్నలకు వెంటనే వ్రాసి పంపగలను. రూ 2 ఎం.ఓ. చేయండి. నెలలవారీగా 12 నెలలకు 1 సంవత్సరం జాతకము రూ 2. పూర్తిపేరు, జాబువ్రాసిన టైము తెలిపిన చాలును.

హనుమాన్ జ్యోతిషాలయము, 10వ లైను, అరండల్ పేట, గుంటూరు 2.



## అరవింద్ బిందీ

ఇది శాస్త్రరీతిగా చేయబడిన సువాసనగల కుంకుమతిలకం. ఇది ఒక్కొక్క రిమునస్సుకు ఇంపైన ఆరు రంగులలో దొరుకును.

ఊదా పచ్చ రోజ మజంట రోజ ఎఱుపు నలుపు

అరవింద్ లేబరేటరీస్

పి. ఓ. బాక్స్ 1415, మద్రాసు-17.

హైదరాబాద్ మినహా ఆంధ్రప్రదేశ్‌కు ఏజెంట్లు:

ప్రగతి ఏజెన్సీస్, విజయవాడ-1.


# లిల్లీ - మల్లీ

"పెదవులా? నైట్రోజన్ పెరాక్సైడ్, ఫెర్రిక్ ఎసిటేట్, పులి చంపిన వేడినెత్తురూ...."

"ఒరేయ్.... ఆ కవి ఇంకా బతికే వున్నాడ్రా..."

"ఆమె కళ్ళల్లోంచి వచ్చేవి గామారేస్‌కాదు—ఆల్ఫాకాదు...బీటాకాదు....అవి ఆండర్సన్ కనిపెట్టిన కాస్మిక్‌రేస్.....బిలియన్ బిలియన్ల శక్తి ఉంది.... నా హృదయాన్ని తూట్లు చేసేశాయి అవి....."

"ఎత్తు, బరువు వగైరాలు...."

ఎత్తా? నా హృదయం అంత ఎత్తు...... ఏజ్ హై ఏజ్ మై హార్ట్...బరువు ఎంతో?.... ప్రస్తుతం తెలియదు....కాలం వదిలెయ్......"

"వయస్సు?"

"నవనవోదయ యవ్వనారంభదశ ...... కళ్ళు విప్పిన కలువపూవులాంటి వయసు.....షోడశ వర్ష ప్రాయ......" పుస్తకం మూసేశాడు రావు.... కలం బల్లమీద ఉంచాడు....

"మరి ఏ స్టాపులో దిగిందన్నావ్......ఊ! నారాయణ గూడా......ఎక్కిది ఎక్కడ.....చిక్కడపల్లి, నారాయణగూడా, బర్కత్‌పూరా, గోల్కొండ చౌరస్తాలల్లో ఎక్కడైనా సరే......

"ఒకరోజు చిక్కడపల్లి స్పెషల్‌లో పోయింది.... మరోరోజు ఏథ్టీ బీ, లోంచి దిగగా, నా కండ్లు రికార్డు చేశాయి......"

"వైశాల్యం కొంచెం ఎక్కువే......ఓ కాగితం ఇలా ఇవ్వు......"

మల్లిబాబు అందించాడు. దానిమీద ప్లాను గీచాడు. రావు. ఇది బర్కత్‌పురా బ్రిడ్జి....ఇది చిక్కడపల్లి... ఇది మహిళామండలి....ఇది ఫిఫ్టీ—బీ నిలిచే చోటు.... ఆమె నారాయణగూడా, లేక దీపక్‌మహల్ స్టాపులోనే దిగుతుంది ఎప్పుడూ! అంతేకదూ?"

"మూడు నెలలు పరిశోధనలుచేసి, నిర్ధారణ చేశాను" ఒక సంవత్సరం రిసర్చిచేసి, వదిలేసిన మల్లిబాబు అన్నాడు.

"మరయితే ఆమె వుండేది క్వార్టర్స్‌లోకాదు..... నారాయణగుడాలోకాదు. రెంటికీ మధ్య......"

"ఇక్కడ......" అన్నాడు మల్లిబాబు తన్మయతతో.

"ఎక్కడ......తటాలున వెనక్కి తిరిగాడు రావు.

"హృదయంలో......" మాటలు మధురంగా వచ్చాయి.

"నోర్మూయ్......ఛస్తుంటే...."

"నిజంరా....మొన్నట్నించి బరువులో రెండు పౌన్లు తగ్గిపోయాను....తేలికయిపోయింది వళ్ళు.... నా హృదయం దొంగిలించుకుపోయింది కదా...... ఒరేయ్ క్రిమినల్‌కేసు నడపలేముట్రా ?"

"ఎందుకు నడుపలేం—ఛస్—నోర్మూయ్..."

" హే భగవాన్.......మైన్‌గాట్...."

"జర్మన్‌లో వాగద్దని ఎన్నిసార్లనాలి!" అరిచాడు రావు......

"ప్రభూ! మదనా! ఓ వీనస్! ఎన్నాళ్ళీ శిక్ష నాకు!" రావు దగ్గర చేరాడు ..... అటూ ఇటూ పచార్లుచేయసాగాడు.

"ఒరేయ్! ఆమెపేరు తెలుసుట్రా నీకు...."

"లిల్లీ ...... నేను పెట్టుకున్నపేరు ...... లిల్లీలాంటి లలితమైన శరీరం.....ఎండలు తక్కువ చేయమని మెటీరియాలజీ డిపార్టుమెంటుకు ఉత్తరం కూడా పంపాను నిన్న."

"అసలుపేరు తెలుసా లేదా?"

"ఉహు! ఆఫ్టరాల్, వాటీజిన్ నేమ్?" 'ఎ రోజ్ స్మెల్స్...'

"షేక్స్‌పియర్ కాలం పోయిందిరా వాన్నా, పేరులేందే కథ నడవదు.....ఎలాగయినా కనుక్కోవాలి! కనీసం ఎక్కడ చదువుతోందో తెలుసా?"

"ఏమో! ఎనిమిదో నెంబరు బస్సు ఎక్కుతుంది..."

"చేతుల్లో డిసెక్షన్ బాక్సుంటుందా?"

"ఉహు......నా ఆశలు, ఆయాశలు, భావి జీవితం మాత్రం పిడికెట్లో పెట్టుకుని...."

"షటప్-స్కేలూ,జామెట్రీబాక్సు ఏదయినా..."

"ఏమో ...... కాని వేళ్ళుమాత్రం—ఓ—కీరో బ్రతికుంటే పడి చచ్చేవాడు...... వేళ్ళు సన్నగా, మొనతేలి ఉన్నాయి.... నిగనిగలాడే ఆ వ్రేళ్ళమీద చంద్రుడిలాగు గోళ్ళు ..... పొడుగ్గా, తెల్లగా......సన్న జాజుల్లాగా......"

"మరి పేరు తెలీదు....ఎక్కడ చదివేదీ తెలియదు......ఇల్లు తెలియదు......ఎలా చావాలిరా!"

"బాబూ, నీమీద అన్ని ఆశలూ పెట్టుకున్నాను.... నీ ముక్కుకి నా పంచప్రాణాలు మేకుకు తగిలించి వట్లు తలిగిలించాను ....... చచ్చానో.....నీ పాలిటి దెయ్యమై పట్టుకుంటాను."

"నీ మొహం.....ఆలోచించనీ అసలు.....ఎనిమిదో నంబరు బస్సులు చాలాచోట్లకి పోతాయి.....ఒకటి సెక్రటరీయేట్.......పుస్తకాలున్నాయి కాబట్టి అది వీల్లేదు.....తర్వాత హెూంసైన్సు కాలేజీ....అది కావచ్చు"

"మరి ఎలా కనుక్కోవటం....."

"రేపు శలవు పెడదాం....ఇద్దరం ఎలాగో అదే బస్సులో ఎక్కుదాం! ముందుగా కూచుందాం. అనుమానం కలుగకుండా డి. పి. ఐ. ఆఫీస్ దగ్గర దిగుదాం........ఎవరన్నా అడిగినా, ఆ యమకూపంలో పనివుందని చెప్పచ్చు......చూద్దాం"

"ఒరేయ్ పోదాం పద...." అన్నాడు మల్లిబాబు.

"హెూటల్‌కేనా? పద" ఇద్దరూ నడిచారు బయటికి.

*   *   *

మరుసటిరోజు మల్లిబాబుకు నాలుగు గంటలకే తెల్లవారింది....నిద్రలేకమునుపే ఒక్కసారి శుక్లాంబరధరం అని శ్లోకం పఠించాడు.....తను అనుకున్నపని పూర్తయితే ఆకుపూజ ఖాయం అనుకున్నాడు ఆంజనేయస్వామికి......బడే చావిడీలో....

అరగంటసేపు ముఖం సానపట్టించాడు ముందు. తాపీగా మరో ముప్పావుగంట క్షవరం చేశాడు. దాదాపు పదినిముషాలు మీసాలు కత్తిరించాడు. నూనె తలకు పట్టించి, దువ్వుకునేముందు రెండుచోట్లు—వాసనకోసం—సెంటు ప్రోక్షించాడు. తొమ్మిదింటికల్లా బట్టలు వేసుకున్నాడు. మడి

గాలిలా వచ్చాడు స్నానాల గదిలోనించి రావు. మూర్తి వేపు చూచాడు

"తీశేయ్ ఈ గుడ్డలు! ఊ! ఒక్కనిముషంలో .. క్విక్"

"ఒరేయ్ .. ఇది నా ఫేవరిట్ డ్రస్‌రా ..."

"షటప్—పెట్టేతీ—ఊ అక్కడ నిలబడు"

పదినిముషాల్లో తయారయాడు మల్లిబాబు. వొక్కనొక్కల జుత్తులోంచి నవపుష్ప పరిమళాలు గాల్లోకి తేలివచ్చాయి ముఖంలో నల్లని మీసకట్టు ప్రకాశించింది. నీలపు ఉలెన్ లాగు మీద షర్టు, నీలాకాశంలో కలిసిపోయింది. పింక్ కలర్ నైలాన్ టై పాముకుబుసంలాగు గాలికి నృత్యం చేసింది. బూటుపాలిష్‌లో ప్రపంచం ప్రతిఫలించింది

"చేతిగుడ్డలో సెంటు వేశావా?"

"ఊ" సగం ఏడుపుతో అన్నాడు తెల్ల డ్రస్ వేపు బాధగా చూస్తూ.

"ఇంక నడువు—దొడ్డకాళ్ళు వేయకు ... ఠీవిగా, వరపూజపెండ్లికొడుకులాగా నడు .... నిన్ను చూచి, లిల్లి మూర్ఛపోవాలి .వెధవా, కుంకలాగున్నావ్—పద.. "

కుడికాలు బయటవుంచాడు మల్లిబాబు.

"ఎవరన్నా తుమ్మినట్లు ."

"నోర్మూయ్ అపభ్రంశపు మాటలు.. ." ఉరిమాడు రావు

హొటల్లో రావు ప్లేట్లు ఎగరదీశాడు మల్లిబాబుకు ఏమీ సహించక వేడి చార్నా, కాస్త మజ్జిగా రుచిచూచాడు టైము తొమ్మిదీ ముప్పావయేవరికి ఎనిమిదో నంబరు క్యూలో వున్నారిద్దరూ.. .

అయిదు నిముషాలయింది కోఠీ బస్సుస్టాపు అన్నీ మనుష్యులతో తేనెటీగ తెట్టులాగ అయిపోయింది. నీరా అంగడిలోకి వెళ్ళివస్తున్నారు కొందరు. కొందరు సిగరెట్లు కాల్చేస్తున్నారు . హఠాత్తుగా అన్నాడు మల్లిబాబు.

"ఒరేయ్ మన ఏరియల్ టిక్కు టిక్కుమంటూందిరా"

"ఏవైపు డైరెక్షన్ ఇస్తూంది?"

"పది గంటల పొజిషన్"

మరోక్షణంలో కణ్వాశ్రమంలో శకుంతలలాగా అజంతా సుందరి రూపంలో ప్రియంవదతో కొందరు బాడీగార్డులతో కోఠీ బస్సుస్టాపు అన్నిటిమీదా, మహోజ్వలకాంతి ప్రసరిస్తూ, యాతాయాత శకటాల్ని అవలీలగా తప్పించుకుంటూ, రాసాగింది లిల్లి మల్లిబాబు హృదయం ఉన్నచోట్లో చిన్న తుఫాన్ మొదలయింది

"మాట ఇరవయి — ముప్ఫయి — ముప్ఫయి అయిదు" అన్నాడు.

"ఏమిట్రా!"

హృదయస్పందనం—" వినీ వినబడకుండా అన్నాడు మల్లిబాబు ఆడవాళ్ళందరూ నిల్చున్నారు స్టాటెజిల్— పొజిషన్స్‌లో. తల తిప్పి, ఓవారు చూచింది కథానాయకి క్షణంలో శతసహస్ర సహస్రాంశలో మల్లిబాబునీ, అతని మిత్రుడినీ గమనించి, గమనించనట్లు చూచింది జడ కుడిభుజం చుట్టూ ప్రదక్షిణంచేసి గాల్లోకి ఎగిరి, ఒక దజను హృదయాల్ని ఎగరవేసి, వెనక్కు చేరింది విజయోత్సాహంతో.

మల్లిబాబు ఫిజిక్స్ స్టూడెంట్ కాబట్టి ఆ త్రుటికాలంలో జరిగిన అల్ట్రాహైస్పీడ్ ఎలక్ట్రానిక్ రియాక్షన్‌ను పసికట్టాడు ఎలక్ట్రానులు దాదాపు కాంతివేగంతో పోతాయి అవి ఒక అణువులోని న్యూక్లియస్ దాటడానికి 10—23 సెకన్లు పడుతుంది. అంతకన్నా వేగంగా జరిగింది సంఘటన. ..

"రిజిస్టర్డ్!" అన్నాడు రావు పెదవులు కదల్చకుండా

"ఇష్ బిన్ నిష్ట్ జిషర్—" అన్నాడు జర్మన్‌లో. వెంటనే తెలుగులో "సరిగా తెలీదు అయినట్లే"

బస్సు వచ్చింది ముందుగా అమ్మాయిల పటాలం ఎక్కింది త్రోసుకుంటూ, తొక్కుకుంటూ ఎక్కారు

---

**"తలవని తలంపుగా నే నొక గొప్ప విషయం కనిపెట్టా" శాస్త్రపరిశోధకుడు తన మిత్రుడికి చెబుతున్నాడు.**

**"అదేమిటో తెలుసుకోవచ్చా?" మిత్రుడు ఉండబట్టలేక అడిగేశాడు.**

**"సిరాబుడ్డి దగ్గర ఉంటే ఫౌన్‌టెన్ పెన్‌ని కూడా మామూలు కలంగా వాడుకోవచ్చు. ఫౌన్‌టెన్ పెన్‌లో సిరా పోయవలసిన అవసరమే ఉండదు!" శాస్త్ర పరిశోధకుడు తాపీగా సమాధానం చెప్పాడు.**

ఎం. కె. రావు (మద్రాసు)

---

ఇద్దరూ కొంత ముందుగా కూర్చున్నారు ఇద్దరూ. బస్సు కదిలింది.

"డి పి ఐ ఆఫీస్ రెండు ..." అన్నాడు టిక్కట్లు తీసుకోటానికి రావు

బస్సు సాగిపోయింది. అబిడ్స్, నాంపల్లి, పబ్లిక్ గార్డెన్స్, లక్డీకాపూల్, మీదుగా డి పి ఐ ఆఫీసుకి. మిత్రులిద్దరూ గబగబా దిగారు. పిట్ట ఎగిరిపోయింది. ఇద్దరి ముఖాలూ బొగ్గులాగు అయిపోయాయి. ఇద్దరూ హోం సైన్సు కాలేజీ ఆవరణలోకి పోయే యువతీ లలామలందర్నీ టెస్ట్ చేశారు ఎక్కడా అంతు దొరకలేదు మల్లిబాబు దాదాపు ఏడ్చేశాడు.

"పరకాయప్రవేశం ఏమయినా వచ్చేమో— పైథాగరస్ అనేవాడు . "

"నోర్మూయ్ ..."

ఇద్దరూ అకౌంటెంట్ జనరల్ ఆఫీసు బస్ స్టాప్ చేరుకున్నారు రుమాలుతో ముఖం తుడుచుకున్నాడు మల్లిబాబు. చెమటతోబాటు ముఖంలో కళ కూడా ఎగిరిపోయింది. ఇద్దరూ రిక్షాలో రూముకి చేరుకున్నారు

"ఎలా ఎగిరిపోయిందిరా ధార్లో ! మధ్యన ఎక్కడా కాలేజీలు లేవే, నాకు తెలిసి—వారెవా ! పోడియం బాబూ నీ డార్లింగ్!" అన్నాడు రావు మంచినీళ్ళు తాగి

"పొటాషియం అనరా! నా డార్లింగ్ ఆమాత్రం వుండకపోతే ఈ స్టూడెంట్లూ, రోడ్డు సైడు రోమియోలూ, ఇతర రకరకాల కీచకులకూ చిక్కకుండా తప్పిచ్చుకు ఎలా పోగలగుతూంది! హాట్స్ ఆఫ్ టు యూ లేడీ ఆఫ్ మై హార్ట్!" అన్నాడు మల్లిబాబు.

"మరి ఆ అమ్మాయి మెట్రిక్ ప్యాసయినట్లు తెలుసునా? కాలేజీలోలేక, ఉద్యోగంలేక ప్రతిరోజూ అదే సమయానికి ఎక్కడికి పోతున్నట్లు!"

"మై డియర్ షెర్లాక్‌హొమ్స్, ఒక్కసారి మన ప్లానంతా దులిపి ఆరవేయి! మనం అసలు సంగతి వదిలేశాము. కనీసం మర్చిపోయాము టెంపరరీగా! ఆమె పేరు తెలుసుకోలే దింతవరకూ!" బల్లమీద పుస్తకాలు సర్దుతూ అన్నాడు

"ఒరేయ్! ఆ నీలం అట్ట పుస్తకం ఏమిట్రా!"

"ఇదా! ఇది ఓ జి ఏ రాఫిల్ టిక్కట్ల పుస్తకం. లెక్చరర్లయినందుకు మా ప్రిన్సిపాల్ మా మెడలకు కట్టిన ప్రతిబంధకం! పన్నెండు రూపాయల ఆముదం!" విసుగ్గా విసిరేశాడు దాన్ని మల్లిబాబు. కాగితాలు తీసి ఆలోచించసాగాడు రావు 'కౌంటర్ ఫాయిల్' వుంది అడ్రస్—పేరు ఎగిరి దూకాడు

"మిత్రమా! పద " అన్నాడు

"ఒరేయ్! రూపాయున్నర వదిలింది చాలు! సాయంత్రం సినిమాకు [illegible]చ్చు ఇప్పుడు మాత్రం దయచేసి" అన్నాడు మల్లిబాబు

"ఇడియట్! పదరా అంటే " లాక్కుపోయాడు మల్లిబాబుని రావు .

ఊరంతా తిరిగి పదిమంది దగ్గర లేదవిపించుకుని, ఎలాగో కష్టపడి ఎనిమిది టిక్కట్లు అమ్మగలిగారు ఇద్దరూ కలిసి. ఇక నాలుగు మిగిలాయి. హొటల్లో కూర్చుని ఉపాయం వివరించాడు రావు. ..

"చూడు! ఆ అమ్మాయి ఎక్కిన బస్సులో ఎక్కు! నారాయణగూడాలో దిగి,ఆమెతోపాటు నడు! దార్లో పలకరించు! నిన్నటి పరామర్శ కానిచ్చి, ఎలాగో అమ్ము! అడ్రసూ, పేరూ వస్తాయి అంతే సబ్జాయ్!

"ఒకవేళ కాదంటే, డబ్బు లేదంటే . ."

"నోర్మూయ్యరా ఏబ్రాసి మొగమా! 'మీ ఇష్టం వచ్చినప్పుడే ఇవ్వండి ... లేపు 'అనలేవూ . .పాపం నోరు తెలియని పసివాళ్ళను చంపుకు తింటావే రోజూ. ఆమాత్రం సేల్సుమన్‌షిప్ ఏడు!"

సాయంత్రం ఆరుగంటలకి మేఘాలమీద ఆడుకుంటూ, 'నా హృదయంలో నిదురించే చెలీ' అని పాడుకుంటూ వచ్చాడు మల్లిబాబు ఎగిరి లేచి కూర్చున్నాడు రావు. టిక్కట్ కౌంటర్ ఫాయిల్ చూచాడు. అదిరిపోయాడు . పేరుంది !

"ఒరేయ్! ఎలా చేశావురా! మళ్ళీ సెంటుకుప్ప..."

లారెన్స్ బలివియర్, గుమ్మడి, రొనాల్డ్ కోల్మన్

లను దాటిపోతూ, అభినయించాడు మల్లిబాబు. జగ్గయ్యలా గొంతుమార్చి చెప్పసాగాడు

"ఆమె అలా రోడ్డంట వచ్చింది నేను ఇలా నడిచాను ముందామె చూచింది—ఓరకంటకాదోయ్ ఆ కలువల చలువంతా నామీద ప్రసరించింది .. చెప్పాను నేరుగా 'దానికేం' అంది 'ప్రస్తుతం నా దగ్గర లేదం'ది వదుల్తానా! భయపడకు అన్నాను నవ్వింది "

"ఏమిటీ!"

"య్యా, మైన్ కిండ్, అంటే మై చైల్డ్! నవ్వింది! తర్వాత తనే ఆ మెలలిత హస్తాల్తో రాసి ఇచ్చింది ... ఈ కలంతో హా! ఓ కలమా! కలువతూటిలాంటి ఆ హస్తాలు పట్టుకున్నాయి నిన్ను! పోయిన జన్మలో ఏం పుణ్యం చేశావు! ఆ పుణ్యం వచ్చే పంచాక్షరీ మంత్రోపదేశం శాయువా నీ యజమానికి!"

" ఊ! తర్వాత "

"ఇద్దరం నడిచాం ఆమె పనివుండి ముందే దిగిందట! తెలుసా! హెూం సైన్సే ఆమెది నా పేరు తప్ప అంతా చెప్పాను... గుడ్ ఈవెనింగ్ చెప్పాను .. వచ్చేశాను... వెనక్కి తిరిగి చూద్దునుకదా ఆమెకూడా తిరిగి చూస్తుంది ఓ వండ్రఫుల్!

"ఒరేయ్ పేరు చూచావా పూర్తిగా"

"యస్! లిల్లీ కొంచెం మారి లలిత అయింది! అంతే! కాని నా హార్ట్సులో, ఇన్నర్‌కోర్టులో మరో లక్ష కాండిల్స్ వేయించింది! పవర్ షార్టేజి ఏమన్నా కానీ!"

"ఇడియట్! కథ అడ్డం తిరిగింది చూడు"

"ఏమిట్రా బాబూ!" అన్నాడు మల్లిబాబు అర్థంకాక.

"ఈ పేరు చూచావా, లలితా షెపర్డ్! అర్థమయిందా!"

"అవును—నాకూ తెల్సు . ఓరి బాబోయ్! హా హాతవిధీ! ఇందాకా గ్రహించలేదు! నేనేం చేతువోయ్ ." మల్లిబాబు పడిపోయాడు నీళ్ళు చల్లి కూర్చోబెట్టాడు రావు .హెూటల్నించి కాఫీ తెచ్చి ఇచ్చాడు

"ఇప్పుడెలాగురా! ఇన్ని కలలు కన్నానే, ఇన్ని ఆశలు పెట్టుకున్నానే .మరింక ఇదంతా విషాదాంతమేనా రావు పచార్లుచేయసాగాడు ... మల్లిబాబు తండ్రి అపరయముడు ఆరడుగుల విగ్రహం విస్ఫులింగాల్ని తయారుచేసే వాన్ డి గ్రాఫ్ జెనరేటర్‌లాంటి కళ్ళు—మడీ మైలా, స్నానంపానం, జపం, హెూమం చేసే అపరవైదికి మరి లిల్లీ ఏమో షెపర్డ్ అనివుంది కాబట్టి—క్రిస్టియన్ మాట్లాడితే మల్లిబాబునాలిక దర్భతో కాల్చి ప్రాయశ్చిత్తం చేయగల డాయన .

"ఏమిరా! ఏం చేయమంటావు!" అన్నాడు రావు

"మరేం చేస్తాను. . రేపు అమెరికాకు పోటానికి దమ్మిడీ ఇవ్వడు ఈ మాట చెపితే చెప్పకపోతే నేను అమెరికాకాదు అండమాన్లకు పోవాల్సిందే "

"మరి అటో ఇటో తేల్చుకోరా!"

"అంతేరా మా నాన్నకు జాబు రాసేద్దాం .. వివరంగా ..." కాగితం పెన్ తీసుకుని కూర్చున్నాడు

# లిల్లీ - మల్లీ

మల్లిబాబు రావు పచార్లు చేస్తూ చెప్పడం మొదలు పెట్టాడు .

"మ—రా—రా—శ్రీ దైవ సమానులయిన నాన్న గారికి, మల్లిబాబు నమస్కరించి వ్రాయునది . . ఈ ఉత్తరం చదివి మీరు కోప్పడగల అవకాశం వుందని ముందే విన్నవించుకుంటున్నాను నా వయస్సు ఇప్పుడు ఇరవయినాలుగేండ్లు . మైనర్ తీరింది నెలకు రెండువందల ముప్ఫయి అయిదు రూపాయల ఉద్యోగం, యం యస్ సీ డిగ్రీ వున్నాయి

ఈ వేసవి సెలవల్లో నేను వివాహం చేసుకోదల్చుకున్నాను. అమ్మాయి కుటుంబంకానీ, డబ్బూ దస్కంకాని అనవసర విషయాలు నాకు నాకా అమ్మాయి అంటే ప్రాణం . ఎలాగూ మీరు బాధ పడుతారని తెలుసు . మీ కాబోయే కోడలిపేరు లలితా షెపర్డ్ పేరు సూచిస్తున్నట్లుగా ఆమె క్రిస్టియన్ కావచ్చు మతాలూ, కులాలూ, నక్ష

"చచ్చేవరకూ మీ తాత తెలివితోనే ఉన్నాడు కదూ?" పరామర్శించడానికి వచ్చిన పెద్ద మనిషి అబద్ధయ్యను అడిగాడు.

"ఏమోనండీ! రేపు ఉదయం వీలునామా చూసిన తరువాత గాని చెప్పలేం" అబద్ధయ్య రఫీ మని సమాధానం చెప్పాడు.

కోణంకి సావిత్రమ్మ, మద్రాసు.

త్రాలూ, గోత్రాలూ పవిత్రప్రేమకు అడ్డురాలేవనిమీకుతెలుసు

వివరాలు తర్వాత రాస్తాను . అమ్మతో నేను బాగుగా మన్నానని చెప్పండి . నమస్కారాల్తో ఈ ఉత్తరం ముగిస్తున్నాను ... మీ

మల్లిబాబు "

ఆ సాయంత్రం జనరల్ పోస్టాఫీసులో పడేసి వచ్చారు లెటర్ని క్వాలిటీలో కాఫీ త్రాగి ఇద్దరూ .

మూడోరోజు పొద్దుటికి దిగాడు మల్లిబాబు తండ్రి ఆ సమయానికి మల్లిబాబు కాలేజీకి పోవటానికి తయారవుతున్నాడు . . రావు ముందుగా పోయాడు

"ఎప్పుడు నాన్నా రావటం?" అన్నాడు మల్లిబాబు

"ఎన్ని గంటలకురా కాలేజీ" అన్న ఒక చిన్న భూకంపాన్ని మల్లిబాబు చెవుల్తోబాటు యుక్రెయిన్‌లోనూ, గుల్మార్గ్‌లోనూ, ఉస్మానియా యూనివర్శిటీలోనూ సైస్మోగ్రాఫ్‌లు రిక్కార్ చేశాయి

"పదిన్నరకు . .ఏం?"

"త్వరగా పద వర్షం వస్తుంది"

"ఎక్కడికి నాన్నా . "

"బయటికి నడవరా ."

అర్థం కాకపోయినా అనుసరించటం ఆంధ్రులకి పరిపాటి అని ఋజువు చేశాడు మల్లిబాబు బర్కత్ పురాలో ఒక ఇంటికిపోయారు ఇద్దరూ మల్లిబాబుకు అక్కడగాని తెలియలేదు తాము పెండ్లి చూపులకు వచ్చినట్లు

"నాన్నా, నా ఉత్తరం.. "

"ముందు చూడరా . ఉత్తరం తర్వాత ..." అన్నాడాయన మందహాసస్మిత వదనుడై.

అయిష్టంగా కండ్లు పైకెత్తి చూచి, క్షణం పాటు నమ్మలేక, మరోక్షణంలో కళ్ళు మూసుకున్నాడు

"లోపలికి పోమ్మా " అన్నారు ఆయన.

కండ్లు తెరిచి చూచేసరికి ఆమె అంతర్ధానమవుతూ కన్పించింది

"నాన్నా! ఇదేమిటి!

"నీ కాబోయే పెండ్లాం! నోర్మూసుకుని నడు ఇంటికి"

* * *

ఆ సాయంకాలం హెూటల్‌లో ఫ్రూట్‌సలాడ్ భక్షిస్తూ కూర్చున్నారు మిత్రులిద్దరూ. అడుగుస్నర ఎత్తు లేచాయి ఖాళీ ప్లేట్లు

"అసలు ఇంతకూ ఏం జరిగిందిరా ! మీ నాన్న మనకథని ట్రాజడీనుంచి ఒక్కసారి కామెడీచేసి పారేశాడే! సినిమా రైటర్‌కాదుకదా! ఒక్కదెబ్బతో ఓ హెన్రీ! మపాసాలను తలదన్ని, బ్రెట్ హార్ట్ హార్ట్ ఆపేసేంతపని చేశాడాయన!"

"రావూ! విను ఆ అమ్మాయి క్రిస్టియన్ కాదు ."

"డామిట్! మీ నాన్న మోసపొయ్యాడు! మీ ఆస్తికోసం ."

"ఉండ్రా! తొందరపడి మా మావయ్యావాళ్ళని ఏమీ అనకు ఆయన బలిదేవుడిలాంటివాడు .లిల్లీ ఆయనకు ఇద్దరు పిల్లలుపోగా పుట్టిన ధరణీ తనయ కాని మూడోఏట జబ్బుచేసి, అవతారం చాలించబోతూవుండగా అమెరికన్ హాస్పిటల్లో చేర్పించారు అక్కడవున్న ఒకానొక స్కాటిష్ నర్స్ లిల్లీని ప్రాణంకన్నా కాపాడి, ప్రాణం పోసింది. ఆ కృతజ్ఞతకు గుర్తుగా "లలిత" కాస్త "లలితా షెపర్డ్" అయింది—నాకోసం!—పూర్ మిస్టర్ రావ్ అర్థం చేసుకోలేక . ..."

"షరి షెపర్డ్ అన్నది ..."

"నా అదృష్టదేవతపేరు ..... మరేంలేదు .... మల్లిబాబు లేచి నిల్చున్నాడు రావు వెంట వచ్చాడు"

"త్వరగా పద . మొదలయి ఉంటుంది సినిమా" అన్నాడు మీసాలు దువ్వి మల్లిబాబు. M. Sc. ★